## రాష్ట్రమంతటా సాధారణ వర్షపాతం

హైదరాబాద్,రానున్న వానాకాలంలో రాష్ట్రమంతటా సాధారణ వర్షపాతం మించి అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండతోపాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని కొంత భాగంలో అధిక వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. ఈ మేరకు జూన్–సెప్టెంబరు నెలల మధ్య వర్షాల ప్రభావంపై హైదరాబాద్ వాతావరణశాఖ నివేదిక విడుదల చేసింది. 'ఎల్ నినో పరిస్థితులు జూన్ నాటికి పూర్తిగా బలహీనపడతాయి. లానినా పరిస్థితులు జులైలో పుంజుకుంటాయి. నైరుతి రుతుపవనాలు జూన్ 8, 11వ తేదీల మధ్య రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని భావిస్తున్నాం. ఆ వెంటనే వానలు ప్రారంభమై జులైలో భారీ వర్షాలు నమోదవుతాయి. ఆగస్టులో సాధారణ రీతిలో కొనసాగుతూ.. తిరిగి సెప్టెంబరులో అధికంగా కురుస్తాయి' అని నివేదికలో పేర్కొంది. గతేడాది రుతుపవనాల రాక ఆలస్యం కావడం, లెక్కకు మించి వానల విరామ కాలాలు నమోదవడంతో సాగుకు విఘాతం కలిగింది.

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :55 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 19-04-2024 | పేజీలు:4 వెల: 2.00

# నిప్పుల కొలిమిలా తెలంగాణ



ఆదిలాబాద్,ఏప్రిల్18: మండుటెండలతో తెలంగాణ జిల్లాలు నిప్పుల కొలిమిగా తయార య్యాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఏప్రిల్‌లోనే ఎండలు అధికంగా ఉండడంతో వచ్చే నెలలో పరిస్థితిని ఊహించుకుని జనం భీతిల్లుతున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గరిష్ఠం 42 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. దీంతో ప్రధాన రహదారులు, వీధులన్నీ బోసిపోయి కర్ఫ్యూను తలపిస్తున్నాయి. ఉపాధిహామీ, ఇతరత్రా పనులకు వెళ్లే కూలీలు ఎండ వేడిమికి తాళలేక ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర ఎండలకు తోడు వేడిగాలులు వీస్తుండడంతో జనం ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకు అధికమవుతున్న ఉష్ణోగ్రతలతో నిప్పుల కుంపటిని తలపిస్తోంది. మధ్యాహ్నం 11 గంటల తర్వాత జనం బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు కూడా ఎండతీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల నుంచి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. రోడ్లపై చిరువ్యాపారులు సైతం సూర్యుడి ధాటికి బయటకు రావడం లేదు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు జనం శీతలపానీయాలు సేవిస్తున్నారు. దీంతో జ్యూస్‌పాయింట్లు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఃానుడి భగభగలకు జనం ఇంటికే పరిమితమవుతున్నారు. . పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ఏసీలు, కూలర్ల వాడకం పెరిగిపోయింది. కొందరు పాత వాటిని బయటకు తీసి వాడుతుండగా, లేనివారు షాపులకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. తద్వారా జిల్లాల్లో విద్యుత్ వాడకం పెరుగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఇక మధ్యాహ్నం పరిస్థితి ఊహికందడం లేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నెత్తిమాడు పగిలిపోతుందా అన్నట్లుగా ఎండ తీవ్రత ఉంటోంది. సూర్యుడి ప్రతాపానికి తోడు వడగాల్పులు వీస్తుండడంతో ప్రజలు బయట ఎక్కువ సేపు ఉండలేక పోతు న్నారు. నగరంలో మధ్యాహ్నం రోడ్లు బోసిపోతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాలనుకునే జనం గొడుగులు, టోపీలు, స్కార్ఫ్లు ధరిస్తున్నారు. అయినా పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎండ తీవ్రత ధాటికి ప్రజలు చల్లటి పానీయాల కోసం పరుగులు తీస్తున్నారు. చెరుకు, నిమ్మకాయ, బత్తాయి, కొబ్బరి బొండాలు, ఇతరత్రా పండ్ల రసాలు అధికంగా సేవిస్తున్నారు. వడగాలులు వీస్తుండడంతో డయేరియా, డీహైడ్రేషన్ లాంటి రోగాల బారిన పడే అవకాశముందని వైద్యులు హెచ్చరి స్తున్నారు. ఎక్కువసేపు ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉందని అంటున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగనుంది.

# కోమటిరెడ్డి బ్రదర్స్ కు జగదీష్ రెడ్డి తీవ్ర హెచ్చరిక



నల్లగొండ: తాను నిఖార్సయిన ఉద్యమకారుడినని, ప్రజల కోసం ఎన్నిసార్లైనా జైలుకు పోయే దమ్మున్న నాయకుడినని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. తనను విమర్శించే అర్హత కోమటిరెడ్డి బ్రదర్స్‌కు లేదని చెప్పారు. వారిద్దరికి బ్రోకర్లు అని పేరుందన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన నల్లగొండలో మీడియాతో మాట్లాడారు. అన్నదమ్ముళ్లు ఇద్దరు కలిసి నల్లగొండ జిల్లా అన్నదాతలను మోసం చేశారన్నారు. సాగర్ నీళ్లను ఆంధ్రకు అమ్మి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వద్ద ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. వైఎస్ ఇచ్చిన భిక్షతో బతికినోళ్లు.. కేసీఆర్‌పై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని.. లేదంటే బట్టలూడదీసి కొడతామంటూ హెచ్చరించారు.కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీకి ఓటెయ్యాలని చెప్పిన దగాకోర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అని ఫైర్ అయ్యారు. తన చరిత్ర ఏమిటో, కోమటిరెడ్డి బ్రదర్స్ చరిత్ర ఏంటో చర్చ పెడదామా అంటూ సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సోదరులు నల్లగొండ జిల్లాకు పట్టిన శని అని, వారికి సంస్కారం లేదన్నారు. ప్రజల ముందు వారి బండారం బయటపెడతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముమ్మాటికీ బీజేపీ మనిషేనని, కమలం పార్టీలోకి పోతాడని కాంగ్రెస్ మంత్రులే లీకులు ఇస్తున్నారని చెప్పారు. కేసీఆర్ జోలికి వస్తే తన్ని తరిమేస్తామని హెచ్చరించారు.

# బీజేపీని ఢీకొట్టేందుకు కాంగ్రెస్ సీట్ల త్యాగం..



న్యూఢిల్లీ,బలమైన బీజేపీని.. ఢీకొట్టేందుకు పొత్తులతో ఎన్నికల బరిలోకి దిగింది కాంగ్రెస్ పార్టీ. అలయన్స్‌లో భాగంగా త్యాగానికి సైతం వెనకాడలేదు. ఈసారి ఎలాగైనా మోదీని దించాలని పట్టుదలతో ఉన్న కాంగ్రెస్.. చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల డిమాండ్లకు తలొగ్గి సీట్లు షేర్ చేసుకుంది కాంగ్రెస్. పొత్తుల్లో భాగంగా మునుపెన్నడూ లేనంతగా ఈసారి తక్కువ సీట్లలో పోటీ చేస్తుంది. 543 ఎంపీ సీట్లకు గాను ఈసారి 326 సీట్లలోనే అభ్యర్థులను బరిలో పెట్టింది కాంగ్రెస్. అంటే ఇంకా 217 సీట్లలో మిత్రపక్షాలకు సీట్లు కేటాయించింది హస్తం పార్టీ.326 సీట్లలో పోటీ చేస్తున్నప్పటికీ 281 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణలో మూడు సీట్లతో పాటు ఇంకా 45 సెగ్మెంట్లకు క్యాండిడేట్లను అనౌన్స్ చేయాల్సి ఉంది. 2004లో 417 సీట్లలో పోటీ చేసింది కాంగ్రెస్. ఇదే ఇప్పటివరకు అతి తక్కువ సంఖ్యగా ఉండగా.. ఇప్పుడు అంతకంటే తక్కువ స్థానాలకు పరిమితం అవుతుంది. 2004 ఎన్నికలతో పోలిస్తే ఈసారి కాంగ్రెస్ పోటీ చేస్తున్న సీట్లు సంఖ్య 91 తగ్గింది.

ఒంటరిగా సాధ్యం కాదని..

ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయేను ఢీకొట్టడం ఒంటరిగా సాధ్యం కాదని.. ఇండియా కూటమిగా ఎన్నికల బరిలోకి దిగింది కాంగ్రెస్. కర్నాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గోవా, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కింతో పాటు ఆరు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రమే పూర్తిస్థానాల్లో పోటీ చేస్తుంది కాంగ్రెస్. మిగిలిన రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కలిసి బరిలోకి దిగింది.

యూపీలో 17 సీట్లలో మాత్రమే పోటీ

80 ఎంపీ సీట్లున్న యూపీలో కాంగ్రెస్ పోటీ చేస్తున్నది కేవలం 17 సీట్లు మాత్రమే. ఇక్కడ సమాజ్‌వాదీ పార్టీ, మిగతా మిత్రపక్షాలకు 63 సీట్లు కేటాయించింది. ఇక మహారాష్ట్రలో 48 సీట్లకుగాను హస్తం పార్టీ 17సీట్లలో.. దాని మిత్రపక్షాలు శివసేన యూబీటీ 21 సీట్లు, %చీఖా% శరద్ పవార్ పార్టీ 10 సీట్లలో పోటీ చేస్తున్నాయి. పశ్చిమబెంగాల్ 42కు గాను 13 సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ వామపక్షాలతో సీట్లు షేర్ చేసుకుంది. బీహార్‌లో 40సీట్లకు 9సీట్లలో, తమిళనాడులో 39 సీట్లకు 9 స్థానాల్లో పోటీ చేస్తుంది. ఈ ఐదు రాష్ట్రాల్లో 249 స్థానాలకు గాను.. కేవలం 25 శాతం సీట్లలో అంటే 65 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తుంది కాంగ్రెస్.

గుజరాత్, హర్యానాలో ఆప్‌తో సీట్ల సర్దుబాటు

ఒడిశాలో 21 సీట్లకు గాను 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.గుజరాత్, హర్యానాలో ఆప్‌తో సీట్ల సర్దుబాటు చేసుకున్న కాంగ్రెస్..పంజాబ్‌లో మాత్రం సింగిల్‌గానే పోటీ చేస్తుంది.పశ్చిమబెంగాల్,ఏపీలో వామపక్షాలతో పొత్తులో ఉంది.కేరళలో మాత్రం లెఫ్ట్ పార్టీలో హొరాహోరీగా తలపడుతోంది హస్తం పార్టీ.

ఈశాన్య రాష్ట్రాల్లో అంతంత మాత్రం

కేరళ, తెలంగాణ, కర్నాటక, హర్యానా, మహారాష్ట్ర, పంజాబ్‌లో మాత్రమే బీజేపీకి బలమైన పోటీ ఇచ్చేస్థాయిలో ఉంది కాంగ్రెస్. యూపీ, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్‌లలో కాంగ్రెస్ ఇండియా కూటమి అంత బలంగా లేదని సర్వేలు అంచనా వేస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లోని 25 సీట్లలో కూడా కాంగ్రెస్ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందంటున్నాయి సర్వేలు. సింగిల్‌గా పోటీ చేసేస్థాయి నుంచి కూటమిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్.. ఈసారి సీట్ల విషయంలో త్యాగం చేయాల్సి వచ్చింది. దేశంలో సగం రాష్ట్రాల్లో మాత్రమే పూర్తిస్థాయి సీట్లలో పోటీ చేస్తుంది హస్తం పార్టీ.

# కాంగ్రెస్ లో మోత్కుపల్లి కలకలం



హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో లోక్ సభ టికెట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. ఎస్సీ సామాజికవర్గంలో అత్యధికంగా ఉన్న మాదిగలకు ఒక్క టికెట్ కూడా ఎంపికైన ఆ వర్గం కాంగ్రెస్ మీద మండిపడుతున్నది. ఇప్పటికే మంద కృష్ణ మాదిగ కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్, బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి మీద తీవ్ర విమర్శలు చేశారు.అయితే బీఆర్ఎస్ పార్టీని వీడి ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాదిగలకు టికెట్ ఇవ్వకపోవడం పట్ల రేవంత్ మీద గుర్రుగా ఉన్నారు. పలు మార్లు రేవంత్ ను కలిసేందుకు ప్రయత్నించిన మోత్కు కనీసం అపాయింట్ మెంట్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సీఎం కావాలని అనుకున్న మొదటి వ్యక్తిని తాను అని, కానీ తనకే కలిసేందుకు అవకాశం ఇవ్వడం లేదని, ఇక ముందు జరిగే పరిణామాలకు రేవంత్ దే బాధ్యత అని మోత్కుపల్లి హెచ్చరించాడు.బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మాదిగలకు రెండు, రెండు టికెట్లు ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీ నేతల కుటుంబాల్లో రెండు, మూడు టికెట్లు ఇచ్చిన మాదిగలకు మాత్రం ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మోత్కుపల్లి గుర్తు చేశారు. పలుమార్లు కలిసేందుకు రేవంత్ అపాయింట్ మెంట్ ఇవ్వని నేపథ్యంలో గురువారం తన ఇంట్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాదిగలకు రెండు లోక్ సభ సీట్లు కేటాయించాలన్న డిమాండ్ తో దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించారు.గత శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించలేదు. అనేక డిమాండ్లు వచ్చినా వారికి టికెట్ కేటాయించిన సామాజిక వర్గం గత ఎన్నికల్లో గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీ వైపు నిలిచారు. ప్రస్తుత చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తో పాటు, బిత్తిరి సత్తి వంటి సెలబ్రిటీలను నష్టనివారణ కోసం బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నా ఓటమి నుంచి తప్పించుకోలేక పోయింది. తెలంగాణలో అధికంగా ఉన్న మాదిగలకు టికెట్ ఇవ్వకపోవడం మూలంగా ఎదురయ్యే పరిణామాలను కాంగ్రెస్ ఎలా ఎదుర్కుంటుంది అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# రేవంత్‌పై నిప్పులు చెరిగిన ఆర్ఎస్పీ



హైదరాబాద్: భువనగిరి గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి చిన్నలచ్చి ప్రశాంత్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రజా పాలనా..? లేదా ప్రజలపై ప్రతీకార పాలనా..? అని రేవంత్ రెడ్డి సర్కార్‌ను ఆర్ఎస్పీ సూటిగా ప్రశ్నించారు. డాక్టరో, ఇంజినీరో కావాలని చదువుకోవడానికి వచ్చిన ప్రశాంత్ ఫుడ్ పాయిజన్‌తో చనిపోవడం అత్యంత విషాదకరమని ఆర్ఎస్పీ ప్రధానంగా. ఇదే భువనగిరిలో రెండు నెలల క్రితం ఇద్దరు పేద అమ్మాయిలు సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ ఉరేసుకుని చనిపోయారు. ఈ ఘటనలపై రేవంత్ రెడ్డి స్పందించలేదు. గుండె లేని వ్యక్తి, పట్టపగలే అబద్ధాలు చెప్పే వ్యక్తి మనకు సీఎంగా ఉండాల్నా..? మన బిడ్డల ప్రాణాలు ఇతని చేతిలో పెడుదామా..? అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. ఒక్కసారి ఆలోచించండి అని ఖచ్చితంగా.ఏప్రిల్ 10వ తేదీన ప్రశాంత్ డయేరియాకు గురయ్యాడు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చికిత్స అందించాడు. 12వ తేదీన అతని ఆరోగ్యం మరింత క్షీణించింది. అయినా కూడా తరగతులకు హాజరయ్యాడు. భువనగిరి సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపల్ గత 6 రోజులుగా స్కూల్‌కు రావడం లేదు. అక్కడున్న ఆర్వో ప్లాంట్ కూడా పని చేయడం లేదు. ఇదీ తెలంగాణ గురుకులాల్లోని పరిస్థితి. తెలంగాణలోని సంక్షేమ పాఠశాలలకు బాధ్యులైన మంత్రి ఎవరో తెలుసా..? అది మరెవరో కాదు రేవంత్ రెడ్డి! ఇప్పటి వరకు ఒక్క సంక్షేమ పాఠశాలను సందర్శించలేదు..! గురుకులాల పనితీరును కూడా ఆయన సమీక్షించలేదు. ఇలాంటి నాయకులు అవసరమా? మన జీవితాలు ముఖ్యం కాదా? రేవంత్ రెడ్డి సీఎం పదవి నుంచి తప్పుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

## ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

సిద్దిపేట,జిల్లాలో అవసరమైన ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసి వడ్లను కొనుగోలు చేయనున్నారు. అయితే ధాన్యం సేకరణకు గన్నీ బ్యాగులు అవసరం ఏటా కనిపిస్తూనే ఉంది. ఇప్పటికే కోతలు మొదలు కాగా ఈ నెలాఖరు, మే నెలలో కేంద్రాల్లోకి ధాన్యం అధికంగా వస్తుంది. అప్పటివరకు గన్నీ బ్యాగులు సరిపడా లేకుంటే ధాన్యం లిఫ్టింగ్‌కు కష్టాలు తప్పేలా లేవు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్ల నుంచి పాత గన్నీ బ్యాగులను సేకరించనున్నారు. ఇవి ఇప్పటికే ఒకసారి ఉపయోగించినవి కావడంతో అందులో దెబ్బతిన్నవి ఉంటాయి. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యాన్ని కొంటామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో యాసంగి ధాన్యం కొనుగోలు విషయంలో కొన్నాళ్లుగా నెలకొన్న అయోమయం నుంచి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు. వారం రోజుల్లో కొనుగోలు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా వడ్ల కొనుగోలుపై దృష్టి సారించడంతో గన్నీ బ్యాగులకొరత నెలకొన్నది. జిల్లాలో నాట్లు ఆలస్యంగా వేయడంతో కొనుగోలు కేంద్రాలకు పది రోజుల తర్వాత నుంచే ధాన్యం పెద్దఎత్తున రావడం ప్రారంభమవుతుంది. ప్రభుత్వం ఆగమేఘాల మీద ధాన్యం కొనుగోలు చేయాలని చూస్తున్నా ధాన్యం అధికంగా వస్తే లారీలోకి ఏవిధంగా లోడింగ్ చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేస్తే ఏ కేంద్రాలకు సరిపోయేలా లేవు.

# జూన్ 9న రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రమాణస్వీకారం




వాయనాడ్ :రాసిపెట్టుకోండి జూన్ 9న రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేరళలోని వాయనాడ్ లో రైతుల సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేరళ ప్రజలు కష్టపడే మనస్తత్వం కలిగిన వారు..తెలివైన వారన్నారు.కేరళ ప్రజల శ్రమ వల్ల దుబాయ్ లాంటి దేశాలు అభివృద్ధి చెందాయని .. కానీ కేరళ అభివృద్ధి కాలేదన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబ సభ్యులు అవినీతిలో మునిగిపోయారన్నారు. బంగారం స్మగ్లింగ్ లో సీఎం విజయన్ కుటుంబ సభ్యుల పాత్ర ఉండటం తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. సీఎం విజయన్ పై ఈడీ, ఆదాయపన్ను కేసులున్నా.. ఆయనపై మోదీ చర్యలు తీసుకోవడం లేదన్నారు.ప్రధాని మోదీతో కేరళ సీఎం విజయన్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాల ప్రయోజనాలు, నిధుల కోసం కేంద్రంతో పోరాటం చేయాలన్నారు. తెలంగాణ, కర్ణాటక, జార?ండ్, ఢిల్లీ లాంటి రాష్ట్రాలు కేంద్రంతో నిధుల కోసం పోరాడుతున్నాయన్నారు. కేరళ సీఎం విజయన్ మాత్రం కేంద్రంతో ఎలాంటి పోరాటం చేయడం లేదన్నారు. పైకి సీపీఎం ముఖ్యమంత్రిగా, కమ్యూనిస్టు నాయకుడిగా కనిపిస్తున్న విజయన్ కమ్యూనిస్టు కాదు.. కమ్యూనలిస్టు అన్నారు.మతతత్వ బీజేపీతో కలిసి విజయన్ పని చేస్తున్నారని నిప్పులు చెరిగారు. వాయనాడ్ లో బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ కి కేరళ ముఖ్యమంత్రి విజయన్ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. సొంత పార్టీ సీపీఎంతో పాటు కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని అన్నారు.ఈడీ, ఆదాయపన్ను కేసులున్నని రోజులు సీపీఎం పార్టీ కోసం విజయన్ పనిచేయరన్నారు. మణిపూర్ లో వందలాది మంది క్రిస్టియన్లు బీజేపీ గుండాల చేతిలో చనిపోయారని తెలిపారు. ప్రధాని మోదీ, అమిత్ షా మణిపూర్ లో పర్యటించలేదని.. కాని రాహుల్ గాంధీ అక్కడి బాధితులను కలిశారని గుర్తు చేశారు రేవంత్. . దేశంలో రెండు పరివార్ ల మధ్య పోరాటం జరుగుతోందన్నారు. మోడీ పరివార్ లో ఈడీ, ఈవీఎంలు, సీబీఐ, ఇన్కంట్యాక్స్, అదానీ, అంబానీ ఉన్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.ఇండియా పరివార్ లో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ , వాయనాడ్ కుటుంబ సభ్యులున్నారని తెలిపారు. ఇందిరా, రాజీవ్ లు దేశం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. సోనియా, రాహుల్ గాంధీ ప్రధాని పదవిని త్యాగం చేశారన్నారు. వాయనాడ్ ప్రజలు రాహుల్ గాంధీ వైపు ఉన్నారని, అయితే తాను ప్రత్యేకంగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదన్నారు. రాహుల్ గాంధీ పై వాయనాడ్ ప్రజల అభిమానాన్ని చూద్దామనే తాను తెలంగాణ నుంచి వచ్చా అని తెలిపారు. తెలంగాణ నుంచి పోటీ చేయాలని మేం రాహుల్ గాంధీని కోరామన్నారు. కానీ.. వాయనాడ్ వైపే ఆయన మొగ్గు చూపారన్నారు. గత ఎన్నికల్లో వాయనాడ్ లో 65 శాతం ఓట్లు వచ్చాయి.. ఈ సారి 75 శాతం ఓట్లు రావాలన్నారు. మోడీకి వ్యతిరేకంగా మనం పోరాటం చేస్తున్నామన్నారు. వారణాసి వర్సెస్ వయనాడ్ మధ్య ఇప్పుడు పోరాటం జరుగుతోందన్నారు. వయనాడ్ ప్రజలు ఓటు వేయబోయేది కేవలం ఎంపీ అభ్యర్థికి మాత్రమే కాదు దేశానికి కాబోయే ప్రధానికి అన్నారు.

## జిల్లాలో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

మంచిర్యాల, పంట చేతికి వచ్చేందుకు ఇంకా సమయం ఉన్నందున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.. ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలకు అవసరమయ్యే గోనె సంచులు సమకూర్చే పనిలో నిమగ్నమయ్యారు. దొడ్డు రకం కొనేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున సకాలంలో అన్ని ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

# దళితబంధు.. అంబేడ్కర్ విగ్రహం

హైదరాబాద్,గతేడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా 125 అడుగుల విగ్రహాన్ని కెసిఆర్ అట్టహాసంగా ఆవిష్కరించారు. ఇప్పుడా విగ్రహం వద్దకు ఎవరూ వెళ్లి నివాళి అర్పించలేదని కెసిఆర్ ఆగ్రహంవ్యక్తం చేశారు. మొన్నీమధ్య అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎవరు కూడా ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి వెళ్లి నివాళి అర్పించలేదన్న ఆక్రోశాన్ని కెసిఆర్ వెళ్లగక్కారు. అలాగే దళితబంధుపైనా చేవెళ్ల సభలో ఆక్రోశించారు. దళితులంతా తిరుగుబాటు చేయాలన్నారు. ఈ రకంగా కెసిఆర్ తానొక్కడినే దళిత జనోద్ధారకుడినని ప్రచారం చేసుకోవడం మొదలుపెట్టారు. నిజానికి కేసీఆర్ మనసులో దళితుల పట్ల ప్రేమ, గౌరవం ఉండదు. బ్రాహ్మణులకు పాదాభివందనం చేసే కేసీఆర్ దళితులకు ఏ సందర్భంలో కూడా పాదాభివందనం చేయడాన్ని మనం చూడలేదు. బ్రాహ్మణ వర్గానికి చెందిన ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు, నరసింహన్ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు వారికి పాదాభివందనం చేయడాన్ని మనం చూశాం! అదే సమయంలో దళితుడైన రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయనకు ఒక్కసారి కూడా పాదాభివందనం చేయలేదు. దీన్నిబట్టి దళితులకు కేసీఆర్ మనసులో ఏ స్థానం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు దేశవ్యాప్తంగా దళితవాదులు పెరగడంతో అంబేడ్కర్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్రాంతం ఆ ప్రాంతం అన్న తేడా లేకుండా దళితులు అందరూ డాక్టర్ అంబేడ్కర్‌ను తమ దైవంగా కొలుస్తున్నారు. అందుకే విగ్రహాన్ని పెట్టి, దళితబంధు పేరుతో బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేశారు. దళితుల ఓట్లు గంపగుత్తగా కొల్లగొట్టాలని కేసీఆర్ దృష్టి పడింది. ఆగమేఘాల మీద అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని తయారు చేయించారు. 'విగ్రహాలు మీకు?అధికారం మాకు' అని దళితులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో వ్యక్తి పూజకు, వ్యక్తుల్ని విగ్రహాలను చేసి పూజించే సంస్కృతికి అంబేడ్కర్ వ్యతిరేకి. అణగారిన ప్రజలు తమ చైతన్యానికి స్ఫూర్తిగానో, ధిక్కారానికి ప్రతీకగానో అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడంలో అర్థముంది కానీ, ప్రభుత్వాలు పనిగట్టుకొని భారీ విగ్రహాలను నెలకొల్పడంలో ఏ అర్థమూ లేదు. అది గుజరాత్‌లో పటేల్ విగ్రహమైనా, తెలంగాణ,ఎపిల్లో అంబేడ్కర్ విగ్రహమైనా.. ప్రజల జీవితాల్లో మార్పేమీ ఉండదు. తెలంగాణలో దళితులకు మూడెకరాల భూమి పేరుతో కెసిఆర్ మోసం చేశారు. ఎపిలో కుల హత్యల కేసుల్లో న్యాయం జరగడంలేదు. సబ్ ప్లాన్ అమలుకు నోచుకోలేదు. ఇలా చెప్పుకొంటూ పోతే అడుగడుగునా దగాపడ్డ దళితులే కనిపిస్తారు. ఆ మహానుభావుడ్ని ఆకాశానికెత్తడం వెనుక ఉన్నవి రాజకీయ ప్రయోజనాలేనని దళితులు కూడా గుర్తిస్తున్నారు. తెలంగాణలో వ్యక్తి పూజ ఫలితంగా కేసీఆర్ నియంతలా మారిపోయారు. ఆయన మాటే శాసనంగా చెల్లుబాటు అయ్యేది. అంబేడ్కర్ ఆశయాలకు కట్టుబడాలని ఉద్బోధించే కేసీఆర్ తాను మాత్రం ఆయన ఆశయాలను ఆచరించ లేదు. తాను స్థాపించిన విగ్రహం వద్దకు వెళ్లి నివాళి అర్పించలేదు.అలాంటప్పుడు రేవంత్ రెడ్డిని ఆడిపోసుకోవడంలో అర్థం లేదు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే రాజకీయ నేతలు నిత్యం మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ జపాలు చేస్తున్నారు. అందుకే జ్యోతీరావ్ పూలే విగ్రహం కూడా పెట్టాలని కవిత గట్టిగానే ప్రయత్నం చేసినా..జైలు జీవితం తప్పలేదు. అంబేడ్కర్ విగ్రహాలను భారీ ఎత్తులో నిర్మించినంత మాత్రాన దళితుల కడుపు నిండదు. వారిని మాయ చేయడానికి మాత్రం ఇవి పనికి వస్తాయి. బీసీల అవసరం ఏర్పడితే మహాత్మాపూలే విగ్రహం రూపొందుతుంది. నిజానికి కొన్నేళ్ల క్రితం వరకు జ్యోతీరావ్ పూలేకు తెలంగాణలో అంత ప్రాధాన్యత ఉండేది కాదు. మరుగునపడిన లేదా నిర్లక్ష్యానికి గురైన మహనీయులను రాజకీయ అవసరాలకోసం వాడుకుంటున్నారు. ప్రజలను మభ్యపెట్టడంలో కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి ఎవరికెవరూ తీసిపోరు. విశాఖ విమానాశ్రయంలో తనపై హత్యాయత్నం జరిగిందని గత ఎన్నికలకు ముందు జగన్ ప్రజలను నమ్మించగలిగారు. ఇప్పుడు గులకరాయి తగలడంతో ఇదంతా చంద్రబాబు చేసిన పనిగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. అదంతా బూటకమని తేలింది. కోడి కత్తి డ్రామా వెలుగులోకి రావడంతో ఆశ్చర్యపోవడం ప్రజల వంతు అయ్యింది. ఈ తరహా ప్రచారమే చేసి ఎన్నికల్లో లబ్ది పొందారు. వివేకా హత్య జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర ఉందని జనాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. ఫేక్ ప్రచారం ద్వారా లబ్ది పొందడం ఎలాగో తెలుసుకున్న జగన్ అండ్ కో రానున్న ఎన్నికల్లో కూడా లబ్ది పొందడానికై అదే ఫేక్ ప్రచారంపై ఆధారపడుతున్నారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లు మాత్రమే ఉన్నా అందులో ఎవరు విజేతనో తేలనుంది. కాంగ్రెస్‌కు రెండుసీట్లు కూడా రావని కెసిఆర్ అనుకుంటున్నారు. మరోవైపు దళితబంధు గురించి ప్రచారం పెంచి అబ్దిపొంద వచ్చన్న ఆలోచన కూడా కెసిఆర్‌లో ఉంది. తెలంగాణ వనరులు సొంతం చేసుకుంటూ ఆర్థికంగా బలపడ్డ కేసీఆర్ రాజకీయ భవిష్యత్తును తెలంగాణ ప్రజలే తేల్చేశారు. చేసిన తప్పుల కారణంగా ఆయన ఎంతగా వగచినా ప్రజలు నమ్మడం కల్ల.

# నిరుద్యోగ భారతం.!

న్యూఢిల్లీ,గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తుడుము కోవడం బిజెపికి అలవాటుగా మారింది. సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఎందుకంటే విలువలు కలిగిన నేతలను పార్టీలో దూరంగా పెట్టారు. కనీసం వారికి మర్యాద ఇచ్చి మాట్లాడే స్థితిలో కూడా లేరు. అందుకే పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ ప్రజల ఉసురు పోసు కుంటున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ

# యుద్ధాన్ని ఎగదోయొద్దు!

న్యూఢిల్లీ,పశ్చిమాసియా నేడు పెను యుద్ధ విపత్తు అంచున ఉన్నది నిజం. దీనికి అగ్గి రాజేసే పని చేయొద్దని పశ్చిమ దేశాల ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశాయి. ఇటువంటి పై విజ్ఞప్తుల వల్ల ప్రయోజనం ఉండదు. దీనికి కచ్చితంగా అంగీకరించేలా యుద్ధోన్మాది నెతన్యాహు మెడలు వంచాలి. గత వారాంతంలో 300 డ్రోన్లు, క్షిపణులతో తమపై దాడి చేయడం ద్వారా ఇరాన్ కవ్వింపు చర్యకు పాల్పడిందని ఇజ్రాయిల్ నిందిస్తోంది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇజ్రాయిల్ కాన్సులెట్‌లో ఇద్దరు జనరల్స్‌తో సహా 13 మంది సైనికాధికారులు, దౌత్యలను వైమానిక దాడి ద్వారా చంపేసిన తన అరాచక చర్య గురించి ఇజ్రాయిల్ మాట్లాడలేదు. దానిని వెనకేసుకొస్తున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇతర పశ్చిమ దేశాలు ఆ ఊసేత్తవు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం డమాస్కస్‌లో కాన్సులెట్‌పై దాడి ఇరాన్‌పై జరిగిన దాడే అవుతుంది. ఇజ్రాయిల్ సాగించిన అరాచక చర్యను మాటమాత్రంగా కూడా ఖండించలేదు ఈ దేశాలు ఇరాన్ ప్రతీకార చర్యను మాత్రం వెంటనే ఖండించాయి. డమాస్కస్‌లో జరిగిన దాడిలో 13 మంది ఇరానీ అధికారులు మరణించారు. దౌత్య కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఇరాన్ ప్రతీకార చర్యలో ఎలాంటి ప్రాణ నష్టం కానీ, విధ్వంసం కానీ చోటుచేసుకోలేదు. ఇరాన్ ఏదో అకస్మాత్తుగా తీసుకున్న చర్యకాదు. కొన్ని గంటల ముందే నోటీసు ఇచ్చింది. తన డ్రోన్లను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేస్తుందని తెలుసు. ప్రతీకార చర్య తరువాత కాన్సులేట్‌పై దాడికి వన్‌టైమ్ పనిష్మెంట్ పూర్తయిందని, సిఫార్సు గనుక ఇజ్రిల్ మళ్లీ దాడి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఇరాన్‌ను ముగ్గులోకి లాగడం ద్వారా దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే డమాస్కస్‌లో కాన్సులెట్‌పై దాడి చేసింది. ఇరాన్‌ను దుష్ట రాజ్యంగా పశ్చిమ దేశాలు చిత్రిస్తున్నాయి నిజానికి ఈ ప్రాంతంలో దుష్ట రాజ్యం ఏదైనా ఉన్నదీ అంటే అది ఇజ్రాయిలే. ఇరాన్ డ్రోన్ దాడిని ఇజ్రాయిల్‌తోబాటు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ అడ్డుకున్నాయని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ కెమరాన్ గొప్పగా చెప్పుకున్నారు. ఇజ్రాయిల్‌కు పలు అంచెల భద్రత కల్పిస్తున్న ఈ దేశాలు గాజాలో ప్రజలను రక్షించడానికి ఎలాంటి రక్షణ ఎందుకు కల్పించలేదు? పశ్చిమ దేశాల కపట వైఖరికి ఇదొక నిదర్శనం.లెబనాన్, సిరియా, ఇరాక్‌లపై పలుమార్లు దాడులు చేసి, ఇరాన్‌ను రెచ్చగొట్టి, మధ్య ప్రాచ్యంలో సంఘర్షణలను పెంచడం ద్వారా అమెరికా, పశ్చిమ దేశాల నుంచి మరింత సాయం పొందడం, దేశీయంగా తన అధికారం కోసం నెతన్యాహు



ఎత్తులు వేస్తున్నారు. యుద్ధం ఆగితే నెతన్యాహు కాపీని మితవాద సంకీర్ణాన్ని గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్న ఇజ్రాయిలీలు ఇప్పటికే ఆందోళనలు చేస్తున్నాయి. అమాయకులను ఊచకోత కోయడం మినహా, బందిలందరినీ విడిపిస్తానని, హమాస్ నాయకత్వాన్ని నాశనం చేస్తానని పెట్టుకున్న యుద్ధ లక్ష్యాలేవీ నెరవేర్చలేదని, దేశాన్ని అప్రతిష్టపాల్జేస్తున్నారన్న ఆగ్రహం ఇజ్రాయిలీయుల్లో వ్యక్తమవుతోంది.రంజాన్ సందర్భంగా గజాలో కాల్పుల విరమణకు పిలుపునిస్తూ ఐరాస భద్రతా మండలి అత్యధిక మెజారిటీతో తీర్మానం చేసినప్పటికీ, ఇజ్రాయిల్ తన దాడులను తీవ్రతరం చేసింది. అమెరికా ఓటింగ్‌కు దూరం గా ఉండి, తీర్మానం ఆమోదానికి అనుమతించినా ఇజ్రాయిల్ తీరులో మార్పు లేకపోవడం అమెరికా, పశ్చిమ దేశాల గుడ్డి మద్దతు ఫలితమే. నెతన్యాహు యుద్ధాలపై లాటిన్ అమెరికా దేశమైన నికరాగ్వా ఐసిసి బోనులో నిలబెట్టినా, పశ్చిమ దేశాల ఒళ్లతో శిక్షించలేని దుస్థితిలో ఉంది.దౌత్యపరంగా తటస్థం అంటూనే పెగాసస్ తదితర స్పైవేర్‌లతో ఇజ్రాయిల్‌తో అల్లుకున్న మితవాద బంధాన్ని మోడీ సర్కారు కొనసాగిస్తోంది. ఇంత చేస్తున్నాను ఇరాన్ సంయమనం పాటిస్తూనే%ఖ% ఇజ్రాయిల్ నౌకలో ఉన్న భారతీయులు 17 మందిని కలుసుకోవడానికి అనుమతించారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి వస్తున్న పాలస్తీనా అనుకూల వైఖరిని విడనాడడం ద్వారా యూదు దురహంకారానికి మద్దతు ఇవ్వడం దేశానికి ప్రమాదకరం. నౌకలో ఉన్న వారిని త్వరగా స్వదేశానికి తరలించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. అమెరికా తొత్తుగా మారకుండా స్వతంత్ర వైఖరిని తీసుకోవాలి. పాలస్తీనాపై దాష్టీకానికి ఇప్పటికైనా ముగింపు పలకాలి. పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు అందించడం మానాలి.

# కమ్యూనిస్టుల ఖిల్లా.. నల్లగొండ



సూర్యాపేట:దేశంలోనే ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచిన తెలంగాణ సాయుధ పోరాటానికి ఆయువు పట్టుగా నిలిచిన ప్రాంతం నల్లగొండ జిల్లా. 1952 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టుల ఖిల్లాగా ఉండేది. వామ పక్షాలు గతంలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి చాలా కాలం పాటు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు నియోజకవర్గాలు కమ్యూనిస్టులకు కంచుకోటలా ఉండేవి. నల్లగొండ, మిర్యాలగూడ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి, సీపీఐ(ఎం), సీపీఐ లు లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించాయి. నల్లగొండ నుంచి పీడీఎఫ్ తరపున రావి నారాయణ రెడ్డి, డి.వెంకటేశ్వర్‌రావు, సీపీఐ నుంచి రావి నారాయణరెడ్డి (1962), బి.ధర్మభిక్షం (1991,1996), సురవరం సుధాకర్‌రెడ్డి (1996,1998)లో విజయం సాధించారు. మిర్యాలగూడ లోకసభ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) తరఫు లక్ష్మీదాస్(1962), భీంరెడ్డి నర్సింహారెడ్డి (1971,1984,1998) గెలుపొందారు. అనంతరం పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మిర్యాలగూడ స్థానంలో భువనగిరి 2009లో ఏర్పాటైంది. పునర్విభజన అనంతరం తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో భువనగిరి నుంచి సీపీఐ(ఎం) తరపున నోముల నర్సింహయ్య, 2019 లో చెరుపల్లి సీతారాములు పోటీ చేసిన విషయం తెల్సిందే. 2019లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరపున గోదా శ్రీరాములు బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకనాడు కమ్యూనిస్టు ఉద్దండులు అసెంబ్లీకి ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించేవారు. ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వామపక్షాల బలం తగ్గుతూ వచ్చింది. కాగా మునుగోడు లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికలలో అప్పటి బీఆర్ యస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపులో కీలకంగా మారిన విషయం తెల్సిందే. ఈ ఎన్నికలతో తిరిగి కమ్యూనిస్టు పార్టీలు అటు రాష్ట్రంలోను.ఇటు జిల్లాలోనూ తమ ఉనికిని చాటుకున్నాయి. మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్?తో జత కట్టిన వామపక్షాలు, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం చెరో దారిపట్టాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే సీపీఐ.. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్?తో జత కట్టింది. తమకు ఓటు బ్యాంకు ఉన్న సీటు భువనగిరి, నల్లగొండ స్థానాల్లో ఒకటైన కేటాయించాలని సీపీఐ కోరింది. అయితే సీట్ల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ నుంచి ఎలాంటి సానుకూల సంకేతాలు అందకపోవడంతో ఇండియా కూటమి పొత్తులో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని సీపీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఒంటరి పోరుకు సిద్ధమైన సీపీఐ(ఎం):

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరు సాగించిన సీపీఐ(ఎం)..భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఒంటరి పోరుకు "సై" అంటోంది. మరోసారి పోరుగడ్డపై ఎర్రజెండాను ఎగురవేయాలన్న ఉత్సాహంతో ఒంటరి పోరు చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా భువనగిరి నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జహంగీర్‌ను బరిలోకి దింపింది. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజక వర్గాల్లో సీపీఐ(ఎం) కు చెప్పుకోదగిన బలం ఉంది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని పలు అసెంబ్లీ నియోజక వర్గాల్లో గతంలో ఒంటరిగా, టీడీపీతో పొత్తులో ఎమ్మెల్యేలుగా గెలిచారు. భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గంలోని ఇబ్రహీంపట్నం, తుంగతుర్తి, జనగామ, నకిరేకల్ నుంచి సీపీఐ(ఎం) చట్టసభలకు ప్రాతినిధ్యం వహించింది. భువనగిరి, ఆలేరులో గతంలో పీడీఎఫ్ ఎమ్మెల్యేలు గెలిచారు. ఈ నేపథ్యంలో పోరాటాల గడ్డ నుంచి ఎండీ.జహంగీర్‌ను బరిలోకి దింపింది. జాతీయస్థాయిలో ఇండియా కూటమిలో భాగంగా సీపీఐ(ఎం) కాంగ్రెస్?కు మద్దతు ఇస్తోంది. అయితే రాష్ట్రంలో తాను పోటీ చేస్తున్న భువనగిరి మినహా మిగిలిన 16 నియోజకవర్గాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై కేంద్ర కమిటీ కసరత్తు చేస్తోంది. భువనగిరిలో మాత్రం పోరు తప్పదని నేతలు చెబుతున్నారు. ఇక్కడ కాంగ్రెస్ తోనే తమ పార్టీకి ప్రధాన పోటీ అని నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే భువనగిరి స్థానం నుంచి తమకు మద్దతు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకత్వం సీపీఐని కోరుతోంది. ప్రగతిశీల వామ భావజాలం కలిగిన నేతలు.. భావ సారూప్యం కలిగిన సీపీఐ(ఎం)కు మద్దతు ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

ఉద్యమాల గడ్డ భువనగిరిపైనే గురి..

పోరాటాల పురిటి గడ్డలో ఎర్ర జెండాను రెపరెపలాడించిన సీపీఐ(ఎం).. పోరాట స్ఫూర్తితో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పాగా కోసం పోరాడుతోంది. ఎన్నికల్లో తన ఓటు బ్యాంకును బలోపేతం చేసుకునేందుకు సీపీఐ(ఎం) వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులను ఇన్‌చార్జీలుగా నియమించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సీనియర్ నేతలను కన్వీనర్, కో కన్వీనర్‌లుగా ప్రకటించింది.

నియోజకవర్గాలకు ఇన్‌చార్జీల నియమాకం..

పార్టీ నేతలు అందరిని ఇన్చార్జీలుగా నియమిస్తూ ప్రచారాన్ని మొదలు పెట్టింది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జీగా సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు చెరువపల్లి సీతారాములును పార్టీ నియమించింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించింది. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా పాలడుగు భాస్కర్, ఆలేరు నియోజకర్గానికి టి.సాగర్, నకిరేకల్‌కు జి.నాగయ్య, తుంగతుర్తికి మల్లు లక్ష్మి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి జాన్‌వేస్లీ, జనగామ నియోజకవర్గానికి ఎండి.అబ్బాస్, మునుగోడు నియోజకవర్గానికి జూలకంటి రంగారెడ్డి లను నియమించింది. వీరంతా లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యే వరకు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ, గతంలో సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహించిన వారిని కలుస్తూ, పార్టీ బలోపేతంతోపాటు అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి అన్ని నియోజకవర్గాల్లో అంతర్గతంగా పార్టీ తీసుకున్న నిర్ణయాలపై సమావేశాలు పూర్తయ్యాయి.

నేడు నామినేషన్ దాఖలు.. భారీ రోడ్ షో..

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి. జహంగీర్ గురువారం భువనగిరిలో నామినేషన్ వేయనున్నారు. భువనగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి జగదేపూర్ చౌరస్తా వద్ద వరకు భారీ ర్యాలీ నిర్వహి%శీ%చనున్నారు. ర్యాలీ అనంతరం బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, ఎస్. వీరయ్యతో పాటూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, కేంద్ర, రాష్ట్ర నాయకులు, నల్లగొండ సూర్యాపేట జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి పలువురు హాజరవుతున్నారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి:జూలకంటి రంగారెడ్డి

నామినేషన్ దాఖలు కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలన్నారు. ఎండలు తీవ్రత వల్ల ఉదయం 10 గంటల వరకే కార్యకర్తలు, డప్పు కళాకారులు చేరుకోవాలని అన్నారు. భువనగిరిలో సీపీఐ (ఎం) పోటీ చేయడాన్ని స్వాగతిస్తూ కవులు, కళాకారులు, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయ వాదులతో పాటు కార్మికులు మద్దతు పలుకుతున్నారని ఆయన తెలిపారు. భారీ ర్యాలీతో నామినేషన్ వేసిన అనంతరం కేంద్ర పార్టీ నేతలతో బహిరంగ సభ జరుగుతుందని జూలకంటి రంగారెడ్డి తెలిపారు.

## గులకరాయి డ్రామాలో బీసీ బిడ్డ బలి

అమరావతి,సానుభూతి కోసం చేసిన గులకరాయి డ్రామాలో బీసీ బిడ్డను బలిచ్చేందుకు జగన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... గతంలో కోడికత్తి డ్రామాలో ఒక దళిత బిడ్డను ఐదేళ్ల పాటు జైలుపాలు చేశారని.. ఇప్పుడు బీసీ వర్గానికి చెందిన సతీష్ అనే అమాయకపు

# టిడిపి హయాంలో దళితుల శిరోముండనం కేసు

రాజమహేంద్రవరం,దళితులకు శిరోముండనం కేసు నుంచి తప్పించుకునేందుకు తోట త్రిమూర్తులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి పదవులను అనుభవిస్తూ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ఘటన జరిగింది. నాడు ఆయన ఎంఎల్ఎగా ఉన్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన నాటి టిడిపి సర్కారు అందుకు విరుద్ధంగా తోటకు కొమ్ముకాసింది. కేసును ఎత్తివేస్తూ ఏకంగా జిఓ జారీ చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఉద్యమించారు. అప్పటి న్యాయవాది బొజ్జా తారకం బాధితుల పక్షాన హైకోర్టులో రిట్ వేశారు. ప్రభుత్వ జిఒను రద్దు చేయించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. పదేళ్ల పాటు సాగిన కాంగ్రెస్ పాలనలో బాధితుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి)ని నియమించింది. కేసు వేగం పుంజుకుంది. మళ్లీ టిడిపి ప్రభుత్వం రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన పిపిని తొలగించింది. బాధితులు, దళిత సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. కేసు కోర్టులో ఉండగా అప్పటి టిడిపి ప్రభుత్వంలో ఎంఎల్ఎగా ఉన్న తోట త్రిమూర్తులు సర్కారు సాయంతో మరో పిపిని నియమించేలా పలుకుబడిని ఉపయోగించారు. తదనంతరం వైసిపి సర్కారు వచ్చింది. వచ్చిన నెలలోనే శిరోముండనం బాధితులకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆదేశాలిచ్చి త్రిమూర్తులును తనవైపు తిప్పుకుంది. పార్టీలో చేర్చుకోవడమే కాకుండా ఎంఎల్‌సి పదవి కూడా ఇచ్చింది. ప్రస్తుతం త్రిమూర్తులుకు మండపేట ఎమ్మెల్యే టికెట్‌ను వైసిపి ఇచ్చి సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిపింది. ఈ తీర్పు నేపథ్యంలో వైసిపి సర్కారు ఎలా స్పందిస్తుందో చూడాలి. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 28 ఏళ్ల నాటి శిరోముండనం కేసులో విశాఖఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులకు 18 నెలల జైలుశిక్ష, లక్షన్నర జరిమానా విధించింది.దళితులకు శిరోముండనం కేసులో 28 ఏళ్లకుపైగా విచారణ సాగిన తర్వాత విశాఖ కోర్టు నేరం చేసినట్లుగా నిర్ధారించి తీర్పు ఇచ్చింది.ఈ కేసులో తోట త్రిమూర్తులుతో పాటు 9 మంది నిందితులుగా ఉన్నారు. 1994లో రామచంద్రాపురం నుంచి ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తోట త్రిమూర్తులు స్థానిక దళితులపై దాడులకు పాల్పడ్డారు. రాజకీయంగా తమకు ఎదురొస్తున్నారనే అక్కసుతో ఐదుగురు దళితుల్ని హింసించి కనుబొమ్మలు తొలగించి, శిరోముండనానికి పాల్పడ్డారు. ఘటన జరిగిన సమయంలో టీడీపీ అధికారంలో ఉంది. ప్రస్తుతం మండపేట వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో తోట త్రిమూర్తులు ఉన్నారు. ఘటన జరిగిన 28ఏళ్ల తర్వాత వెంకటాయపాలెం శిరోముండనం కేసులో విశాఖ కోర్టు తీర్పును వెలువరించింది. శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిందితుడిగా ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాత్రను ప్రాసిక్యూషన్ నిరూపించింది. నిందితుల్లో ఒకరు మరణించగా 9మందికి శిక్షలు ఖరారు చేశారు. 1997 జనవరి 1న కేసు నమోదైంది. 1994లో తోట త్రిమూర్తులు రామచంద్రాపురం నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచి టీడీపీలో చేరారు. స్థానికంగా తనకు వ్యతిరేకంగా ఉన్నారనే కారణంతో దాడి చేసి హింసించారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. బాధితులకు న్యాయం చేయాలంటూ దళిత సంఘాలు పెద్దఎత్తున ఉద్యమించాయి. ఈఘటనలో మొత్తం 24 మంది సాక్షులుగా గుర్తించారు..వారిలో 11 మంది మృతి చెందారు..ఈ కేసు విచారణలో రకరకాల మలుపులు తిరిగింది.1998లో ఈ కేసును కొట్టివేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది.. అయితే మళ్లీ హైకోర్టు ఆదేశాలతో 2000లో కేసు రీ ఓపెన్ చేశారు..2012 నుంచి 2019 వరకు 146 సార్లు ఈ కేసు వాయిదా పడింది..28 ఏళ్లుగా సాగిన విచారణ తర్వాత ఈ కేసులో తోట త్రిమూర్తులకు 18 నెలల జైలుశిక్ష, లక్షన్నర జరిమానా విధించింది.. ప్రస్తుతం ఏపీలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో శిరోముండనం కేసు తీర్పు హాట్ టాపిక్‌గా మారింది.. అయితే 28 ఏళ్ల తర్వాత తీర్పు రావడంతో తమకు న్యాయం జరిగిందంటూ బాధితుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# హిందుత్వ ఎజెండా

న్యూఢిల్లీ, త్వరలో జరిగే కొన్ని రాష్ట్రాల ఎన్నికలతో పాటు, 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీని హిందుత్వ అనుకూలవాదిగా సిద్ధం చేయాలని కాంగ్రెస్ ప్లాన్ వేస్తోంది. మోడీని ఢీకొనాలంటే అధికశాంత ఉన్న హిందువుల ఓట్లు ఆకట్టుకోవాలి. అందుకే ఇటీవల హిందూ అనుకూల విషయాల్లో కొంత సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. రాహుల్ హిందుత్వవాది అనిపించుకోవాలని పక్కాగా ప్లాన్ వేసినట్లు కాంగ్రెస్ నేతల ద్వారా వెల్లడవుతోంది. ఆలయాలకు వెళ్లడం, పూజలు చేయడం పెద్దపెద్ద బొట్లు పెట్టుకోవడం వంటివన్నీ అన్నా చెల్లెళ్లు చేస్తున్నారు. ఇటీవల ఫలితాలను బేరీజు వేసుకున్నాక కొంత హిందుత్వ విషయంలో రాహుల్ కూడా ఆలోచన చేస్తున్నట్లుగా క్షేత్రస్థాయికి సమాచారం చేరవేస్తున్నారు. బిజెపిని ఢీకొని అధికారంలోకి రావాలంటే జాతరల్లో ఓట్లను పట్టాలని చూస్తున్నారు. హిందుత్వ ఓట్లు నిజంగానే గంపగుత్తగా బిజెపికి పడివుంటే ఈ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది కాదు. కానీ ముస్లిం సంతుష్టీకరణపై మాత్రం హిందువుల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ హయాంలో అనేక సందర్భాల్లో ముస్లింల కోసం గీతదాటింది. ఎన్నికల సంవత్సరం ప్రారంభం కావడంతో నేపథ్యంలో బిజెపిని మించి హిందుత్వాన్ని ప్రదర్శించాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే రాహుల్‌ను మోడీని మించిన హిందుత్వవాదిగా తయారు చేయాలని చూస్తున్నారు. ఇదిసానుకూల ఫలితం ఇస్తుందా లేదా అన్నది చూడాలి. నిజానికి దేశానికి ఇప్పుడు ఏం కావాలి... మనం ఏం తప్పులు చేశాం... ఏం చేయలేకపోయాం... గతంలో పదేళ్లు ప్రజలు అధికారం కట్టబెడితే ఎందుకు దేశాన్ని సక్రమంగా పాలించలేక పోయాం అన్న ఆత్మపరిశీలనతో ముందుకు వెళితే తప్ప కాంగ్రెస్ మనుగడ సాధించడం కష్టం. కేవలం గుళ్లూగోపురాలు తిరిగితే ప్రజలు ఓట్లు వేస్తారనుకుంటే పొరపాటు. అలా అనుకుంటే దివంగత పివి నరసింహారావు హయాంలో అయోధ్యలో వివాదాస్పద మసీదు కూల్చివేత తరవాత కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. హిందువులు ఈ విషయంలో పివిని ఆదర్శంగా తీసుకుని, హిందువులకు అతనే ప్రతినిధి అని అనుకుని ఉంటే భారీ మెజార్టీతో మళ్లీ గెలిపించే వారు. కానీ అలా జరగలేదు. దేశంలో బీజేపీ క్రమక్రమంగా ఎదుగుతున్న వైనాన్ని మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు గమనించినందువల్లనే బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో ఉదాసీనతతో వ్యవహరించారని, ఆయన వల్లే మైనారిటీలు దూరం అయ్యారని కాంగ్రెస్‌లో ఒక వర్గం ఆనాడు భావించింది. అందుకే తరవాత పివిని దూరం పెడుతూ వచ్చారు. అర్జున్ సింగ్ వంటి నేతలు పి.వి. నరసింహారావు అనుసరించిన హిందూత్వ విధానాలపై లేఖాస్త్రాలు సంధించి ఇరుకున పెడుతూ ఉండేవారు. మాధవరావు సింధియా, చిదంబరం తదితర నేతలు పివిని తక్కువ చేసి చూశారు. పి.వి. హయాంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్న గాడ్గిల్ కాంగ్రెస్ రోజురోజుకూ క్షీణించిపోవడానికి కారణం ముస్లింలను బుజ్జగించే ప్రయత్నాలు చేయడమేనని చెప్పేవారు. సోనియా హాయంలో రెండు పర్యాయాలు అధికారం అనుభవించాక ఇంతగా దిగజారి పోవడం ఇదే ప్రథమం. అందుకే కొందరు రాహుల్‌ను హిందూ ప్రతినిధిగా ప్రజలు గుర్తించేలా చేయాలని తపాత్రయపడు తున్నట్లుగా ఉంది. సోనియా స్వతహాగా క్రిష్టియన్ కావడం, విదేశీ వనిత కావడం వల్ల ఇంతకాలం ఆమె

# దూకుడు పెంచిన జనసేనాని



అమరావతి, ఏపీలో ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఏపీలో రాజకీయవేడి పెరుగుతోంది. ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారంలో మునిగి తేలుతున్నారు. నిత్యం జనాల్లోనే వారిని ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ పార్టీ అభ్యర్థులకు బి ఫారాలు అందజేశారు. తొలి ఫారంను జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్, లోకం మాధవికి పవన్ అందజేశారు. తనతో సహా 20 మంది ఎమ్మెల్యే, ఇద్దరు ఎంపీ అభ్యర్థులకు బి ఫారాలను పవన్ ఇచ్చారు. పాలకొండ నుంచి జయకృష్ణ వ్యక్తిగత కారణాలతో రాలేకపోయారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే జనసేన అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బీఫామ్‌లు అందజేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 21 అసెంబ్లీ, ఇద్దరు లోక్‌సభ అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత నాదెండ్ల మనోహర్‌కు బీఫామ్ అందజేశారు. తెదేపా, భాజపాతో పొత్తులో భాగంగా జనసేనకు 21 అసెంబ్లీ, రెండో పార్లమెంట్ సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. అందరం కలిసి రాష్ట్రాన్ని పునర్‌నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలే దేవుళ్లు.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం. పోలవరం పూర్తి చేసి, నదుల అనుసంధానానికి కృషి చేస్తాం. విద్య, ఉపాధి అవకాశాలు, అభివృద్ధికి కంకణబద్ధులై పనిచేస్తాం. వలసలు లేని, పస్తులు లేని వికసిత ఏపీ ఏర్పాటు మనందరి బాధ్యత. జనసేన, తెదేపా, భాజపా కూటమి గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం. అవినీతి, రాక్షస పాలనను తరిమికొట్టాలి. అందరూ కలిసి పనిచేయాలి.. ప్రజల్లోకి వెళ్లాలి. వివాదాలకు తావులేకుండా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పార్టీ అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు చాలా కీలకమని.. ప్రతిఒక్కరూ క్షేత్ర స్థాయిలో పర్యటనలు, ప్రచారం చేయాలన్నారు. ఈ ఐదేళ్లలో జరిగిన దాడులు, దారుణాలు ప్రజలకు వివరించాలన్నారు. పవన్ కల్యాణ్ మనపై నమ్మకంతో అవకాశం కల్పించారని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ప్రజలకు మనమేం చేస్తామో, ఏమి చేయగలమో వివరించాలన్నారు. బీజేపీ, టీడీపీ నేతలను కలుపుకుని విజయమే లక్ష్యంగా అడుగులు వేయాలన్నారు. తప్పకుండా నవ శకానికి నాందీ పలికేలా అందరూ కలిసి పని చేయాలని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.

# కడియం లక్ష్యంగా బిఆర్ఎస్ నేతల విమర్శలు

వరంగల్,వరంగల్ జిల్లాలో రాజకీయం వేడెక్కింది. నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కడియం కాంగ్రెస్‌లో చేరడంతో వీరంతా విమ్మలకు పదను పెడుతున్నారు. గత 15రోజుల వరకూ భాయ్ భాయ్ అంటూ తిరిగిన నేతలు.. ఒక్కసారిగా మెడలో కండువా మారడంతో బద్ధ శత్రువులైపోయారు. నిన్నటి వరకూ కలుపుగోలుగా తిరిగిన నేతలు మాటల దాడి చేసుకుంటున్నారు. వరంగల్ ఎంపీ సీటు విషయంలో పార్టీ మారిన కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ జంప్‌కి కారణం కడియం అంటూ ఆరోపించారు. వరంగల్ లోజరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల మీటింగ్ లో కడియంపై ఫైర్ అయ్యారు.కడియం శ్రీహరికి డాక్టర్ రాజయ్య సవాల్ విసిరారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. త్వరలో కడియం విదేశీ ఆస్తుల వివరాలు బయటపెడతానన్నారు. కడియంపై మాజీ మంత్రి దయాకర్ రావు సెటైర్లు వేశారు. కడియం జీవిత చరిత్ర మొత్తం తన చేతిలో ఉందన్నారు. టైం వచ్చిన రోజు బయటపెడతాన్నారు. కడియం శ్రీహరి వల్ల కాంగ్రెస్‌కి త్వరలో పెనుప్రమాదం పొంచి ఉందంటూ పెద్ది సుదర్శన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2, 3 నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తాయన్నారు. దానంకు నోటీసులు వచ్చాయి. రేపో మాపో కడియంకు కూడా నోటీసులు



వస్తాయన్నారు.మరోవైపు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్యపై మండిపడ్డారు కడియంశ్రీహరి. లిఫ్ట్ ఇరిగేషన్‌లో పల్లా లంచాలు తీసుకుంటే.. దళితబంధులో రాజయ్య లంచాలు తీసుకున్నారని ఆరోపించారు కడియం. వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ వర్సెస్ కడియం అన్నట్లుగా మారింది రాజీయం. కడియం టార్గెట్‌గా బీఆర్ఎస్ నేతలు ప్రచారం మొదలెట్టారు. ఈవిమర్శల దాడి ముందుముందు ఇంకెత వరకూ వెళ్తోందో చూడాలి.

# కడపులో కత్తులు.. అయినా కౌగలింతలు

న్యూఢిల్లీ,రాజకీయాలు చిత్ర విచిత్రంగా మారుతున్నాయి. ఒకచోట ప్రశంసలు కురిపించుకున్న వాళ్లే.. మరో చోట విమర్శలు చేసుకుంటున్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న పార్టీలు.. ఒక చోట కలిసి పోటీ చేస్తుంటే.. మరోచోట ప్రత్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు. అయితే.. ఈ కూటమిలోని అనైక్యత బీజేపీకి కలిసొస్తుందనే ప్రచారం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. కాగా, ఎన్నికలకు ముందే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, బీహార్ సీఎం నితీష్ కుమార్ భారత కూటమికి దూరమయ్యారు. నితీష్ కుమార్ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చేరగా.. మమతా బెనర్జీ బెంగాల్‌లో ఒంటరిగానే పోటీ చేస్తున్నారు. పంజాబ్, కేరళ రాష్ట్రాల్లో ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలు ప్రత్యర్థులుగా తలపడుతున్నాయి.

పశ్చిమ బెంగాల్‌లో

పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి టీఎంసీ, బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. కేరళలో మాత్రం కాంగ్రెస్, వామపక్షాలు వేర్వేరుగా తలపడుతున్నాయి. కాంగ్రెస్ యూడీఎఫ్ కూటమిగా, వామపక్షాలు ఎల్‌డీఎఫ్ కూటమిగా పోటీ చేస్తున్నాయి. భారత కూటమి, కాంగ్రెస్, వామపక్షాలు రెండూ తలపడుతున్నాయి. పొత్తులో భాగంగా పశ్చిమబెంగాల్‌లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ కాంగ్రెస్‌కు 12 సీట్లను వదిలిపెట్టగా.. రెండు సీట్లలో లెఫ్ట్ ఫ్రంట్‌లో భాగమైన ఫార్వర్డ్ బ్లాక్‌తో స్నేహపూర్వక పోటీ కొనసాగనుంది.

కేరళలో ఎల్‌డీఎఫ్-యూడీఎఫ్ మధ్య పోటీ

బెంగాల్‌లో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీ చేస్తుంటే.. కేరళలో పరిస్థితి పూర్తి విరుద్ధంగా ఉంది. కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. వయనాడ్ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీ చేస్తుండగా.. సీపీఐ నుంచి డి. రాజా భార్య అన్నీ రాజా పోటీ చేస్తున్నారు. బెంగాల్‌లో రెండు పార్టీల నేతలు కలిసి ప్రచారం చేస్తుంటే.. కేరళలో మాత్రం కాంగ్రెస్, వామపక్షాలు ఒకరిపై మరొకరు



మాటల యుద్ధం కొనసాగిస్తున్నారు.

గతంలోనూ ఇదే తీరు..

కాంగ్రెస్, వామపక్షాలు ఈ వ్యూహాన్ని అనుసరించడం ఇదే మొదటిసారి కాదు. దాదాపు ఒకే సమయంలో కేరళ, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. 2021 ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్, వామపక్షాలు పొత్తు పెట్టుకోగా.. కేరళలో మాత్రం విడిగా పోటీ చేశాయి. బెంగాల్‌లో లెఫ్ట్-కాంగ్రెస్ కూటమికి ఒక్క సీటు రాలేదు. బెంగాల్ శాసనసభలో కాంగ్రెస్, వామపక్షాల నుంచి ఒక్క అభ్యర్థి గెలవకపోవడం అదే తొలిసారి. జేపీ తొలిసారిగా 70 సీట్లు గెలుచుకుని రికార్డు సృష్టించగా.. మమతా బెనర్జీ పార్టీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

2019 ఎన్నికల్లోనూ..

2019 ఎన్నికల్లో కేరళలో యూడీఎఫ్‌కి ఎక్కువ సీట్లు వచ్చాయి. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, కేరళ కాంగ్రెస్ (ఎం), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీతో కలిసి రాష్ట్రంలోని 20స్థానాలకు గాను 19 స్థానాలను యూడీఎఫ్ గెలుచుకుంది. కేరళలో బీజేపీ బలహీనంగా ఉండటంతో ఇక్కడ కాంగ్రెస్, వామపక్షాలు ప్రత్యర్థులుగా తలపడుతున్నాయి. మొత్తానికి బెంగాల్‌లో దోస్తీ.. కేరళలో కుస్తీ చేస్తున్నట్లుగా కాంగ్రెస్ పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

# మోడీ గాలి లేదు: బిజెపి అభ్యర్థి నవనీత్



ముంబై: దేశంలో మోడీ ప్రభంజనం లేదంటూ మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి, అలనాటి సినీ నటి నవనీత్ రాణా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆమె నిజమే చెబుతోందని, క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను ఆమె మాటలు ప్రతిబింబిస్తున్నాయని ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి(ఎంవిఎ) వ్యాఖ్యానించింది. అమరావతి నియోజకవర్గంలో సోమవారం ఒక ఎన్నికల సభలో ప్రసంగిస్తూ నవనీత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలను గ్రామ పంచాయతీ ఎన్నికల తరహాలోనే మనం పోరాడాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటల లోపల ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్లి మనకే ఓటు వేయమని చెప్పాలి. మోడీ గాలి వీస్తోందన్న భ్రమల్లో బతకకండి. గత ఎన్నికలలో వాళ్ల దగ్గర అన్ని వనరులు ఉన్నాయి. అయినా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నేనే గెలిచాను అని నవనీత్ చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో అమరావతి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నవనీత్ గెలిచారు. ఆ ఎన్నికలలో అవిభక్త ఎన్‌సిపి ఆమెను బలపరిచింది. నవనీత్ రాణా వీడియో వైరల్ కావడంతో ఎన్‌సిపి(శరద్ పవార్), శివసేన(యుబిటి) స్పందిస్తూ నవనీత్ వ్యాఖ్యలలో బిజెపి శ్రేణులలో భయాందోళనలు నెలకొన్నాయని చెప్పారు. మహారాష్ట్రలోని మొత్తం 48 లోక్‌సభ స్థానాలను ప్రతిపక్ష కూటమి గెలుచుకుంటోందని శివసేన(యుబిటి)కు చెందిన రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ధీమా వ్యక్తం చేశారు.మోడీ ప్రభంజనాన్ని పక్కన పెట్టండి. మోడీ తన సీటును గెలుచుకోవడం కూడా అనుమానమే. దేశంలో బిజెపికి 45 సీట్లు వస్తాయని ఉద్ధవ్ థాకరే ఇదివరకే చెప్పారు. బిజెపి సొంత అభ్యర్థులే నిజాలు చెబుతున్నారు. చాలా బహిరంగంగా..స్పష్టంగా అంటూ సంజయ్ అదిరిపోయాడు. కాగా.. సిపి(శరద్ పవార్) అధికార ప్రతినిధి మహేష్ తాపసే సూచనూ నవనీత్ రాణా నిజాలు మాట్లాడుతున్నారని, ఈ కారణంగానే బిజెపి ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటోందని అన్నారు. క్షేత్రస్థాయిలో తెలుసుకున్న తర్వాత నవనీత్‌కు, ఇతర బిజెపి అభ్యర్థులకు వాస్తవ పరిస్థితులు అర్థమయ్యాయని, మోడీ గాలి వీయడం లేదన్న వాస్తవం బిజెపికి కూడా అని ఆయన చెప్పారు. ప్రతిపక్ష నాయకులను ఒకరి వెంట ఒకరిని బిజెపి చేర్చుకోవడంతోనే ఆ పార్టీ పరిస్థితి అర్థమవుతోందని, అవినీతిపరులని నిందించిన ప్రతిపక్ష నాయకులను కూడా బిజెపి చేర్చుకుంటోందని ఆయన చెప్పారు.గెలిచే అవకాశం ఉన్న ప్రతిపక్ష అభ్యర్థులకు సైతం బిజెపి గాలం వేస్తోందని ఆయన అనుకూలంగా ఉన్నారు. తన వ్యాఖ్యలు వివాదం కావడంతో నవనీత్ రాణా వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. తప్పుడు భాష్యాన్ని సృష్టించేందుకు తన మాటలను ఎడిట్ చేసి ప్రతిపక్షం వైరల్ చేస్తోందని ఆమె గుర్తు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ చేసిన పనుల గురించి ప్రజలకు తెలుసునని, మోడీ ప్రభంజనం గతంలో ఉంది..ఇప్పుడూ ఉంది..రేపూ ఉంటుంది అంటూ ఆమె ప్రకటించారు. మోడీ హామీలను ప్రజల వద్దకు తీసుకు వెళుతూ ఓట్లు అడుగుతున్నామని ఆమె చెప్పారు. ఈసారి 400 సీట్లు సాధించాలన్న లక్ష్యాన్ని సాధిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బిఆర్ఎస్ పునాదులు ఖతం



నల్గొండ, లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు ఒక్క సీటు కూడా రాదని.. వస్తే తాను దేనికైనా సిద్ధమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని ఆ పార్టీ నేతలు చూస్తున్నారని ఆరోపించారు. తమను టచ్ చేస్తే బిఆర్ఎస్‌ను భూస్తాపితం చేస్తామని హెచ్చరించారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం అవుతుందంటూ భారాస అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. తమను టచ్ చేస్తే భారాసను పునాదులతో సహా పెకిలిస్తామని హెచ్చరించారు. మూడు నెలల్లో ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందని.. ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే వారికి మిగులుతారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. 12-13 సీట్లు తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌తో కేసీఆర్, కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారు. వాళ్లిద్దరూ త్వరలో జైలుకు వెళ్లడం ఖాయం. చర్లపల్లి జైలులో డబుల్ బెడ్‌రూమ్ కట్టించి స్వాగతం పలుకుతాం అని మంత్రి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీని టచ్ చేస్తే హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ పునాదులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ 30 మంది ఎమ్మెల్యేలు వస్తామంటున్నా తాము వద్దంటున్నామన్నారు. కాంగ్రెస్ అనుకుంటే తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కూడా బీఆర్ఎస్ పార్టీలో ఉండరని సంచలన కామెంట్స్ చేశారు. ముఖ్యమంత్రిని లిల్లీ పుట్ అంటారా.... ప్రజల నుంచి వచ్చిన నాయకుడు రేవంత్ రెడ్డి... దొంగ పాస్ పోర్ట్‌లు చేయలేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. విటమిన్ డీ తీసుకొని కేసీఆర్ దొంగ దీక్షలు చేసి చావు నోట్లో తలపెట్టి ఉద్యమం చేశానని చెప్పుకుంటారా అంటూ మండిపడ్డారు. కవిత జైలుకు పోయినా బుద్ధి మారలేదా అని ప్రశ్నించారు. అవినీతి చేసిన కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మిర్యాలగూడలో రైస్ మిల్లుల దగ్గరికి తాను వెళ్ళాక రైతుల ధాన్యం రూ.2500 కొన్నారన్నారు. రేవంత్ రెడ్డి ముఖం చూసే ధైర్యం లేకనే రెండుసార్లు కేసీఆర్ అసెంబ్లీకి రాలేదన్నారు. 12-13 సీట్లలో కాంగ్రెస్ గెలుస్తుందని... బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటూ రాదన్నారు. కవిత జైలుకు పోయాక కేసీఆర్‌కు మెంటలా ఉందని.. అందుకే రేవంత్ బీజేపీలోకి పోతున్నారని అంటున్నారని మండిపడ్డారు. రెండేళ్లయినా కవితకు బెయిల్ రాదన్నారు. కేసీఆర్ కట్టె పట్టుకొని వేటాడుతాం అంటున్నారని.... రేపటి నుంచి తామూ వెంటాడుతామంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# పతంజలికి వ్యవస్థ దాసోహం

న్యూఢిల్లీ,పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల విషయంలో బాబా రాందేవ్ తనకు నచ్చినట్టుగా వ్యవహరించారు. తమ ఉత్పత్తులకు అనేక రోగాలను నయం చేసే సామర్థ్యం ఉన్నదని అధికారికంగా ప్రభుత్వ సంస్థల నుంచి ఎలాంటి సర్టిఫికెట్ లేకున్నా.. బాబా రాందేవ్ ప్రకటనలతో హోరెత్తించారు. స్థానిక పత్రికలు, ఛానెళ్లే కాదు.. ఏకంగా జాతీయ ఆంగ్ల వార్త పత్రికలు, మీడియా ఛానెళ్లలో ఈ ప్రకటనలు వచ్చాయి. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఈ అంశాన్ని చూసి చూడనట్టుగా వ్యవహరించాయి. మీడియా, బ్యూరోక్రసీ కూడా పతంజలి తప్పుడు ప్రకటనల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించాయి. దీంతో ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని పతంజలి బాబా రెచ్చిపోయి, విపరీత ప్రకటనలు, కోట్ల రూపాయల్లో వ్యాపారం చేశాడని విశ్లేషకులు, మేధావులు అంటున్నారు.న్యూఢిల్లీ : పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల విషయంలో యోగాబాబా ప్రజలను తప్పుదోవ పట్టించాడని చెప్తున్నారు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, కాలేయ రుగ్మతల వంటి వివిధ రోగాలకు కు చికిత్స చేస్తామని పేర్కొంటూ దాదాపు రెండేండ్ల క్రితం పతంజలి తన ఆయుర్వేద ఉత్పత్తుల కోసం ఆంగ్ల భాషా వార్తాపత్రికలలో వరుస ప్రకటనలను ప్రచురించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఇలాంటి ప్రకటనల విషయంలో ఎట్టకేలకు సుప్రీంకోర్టు పతంజలి సంస్థపై కొరడా ఝులిపించింది. దీంతో క్షమాపణలు చెప్పటానికి బాబా రాందేవ్, పతంజలి హెడ్ బాలకృష్ణలు దిగిరావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని విశ్లేషకులు అంటున్నారు. అయితే, పతంజలి ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన విధానంలో వ్యవస్థ దాసోహమైం దని నిపుణులు చెప్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు, ఇటు ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వాలు బాబా రాందేవ్‌ను నియంత్రించలేదని అంటు న్నారు. అలాగే, ఒక వర్గం మీడియా, ఉన్నతాధికారులు సైతం పతంజలి విషయంలో ఉదాసీనంగా వ్యవహరించారని చెప్తున్నారు.'ది హిందూ', 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వంటి కొన్ని ఆంగ్ల భాషా వార్తాపత్రికలు ఇప్పుడు పతంజలికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు చర్యకు మద్దతుగా సంపాదకీయాలను ప్రచురించాయి. చట్టాన్ని ఉల్లంఘిస్తూ వచ్చిన ప్రకటనలను ప్రచురించటంలో కొన్ని పత్రికలు పోషించిన పాత్రకు సంబంధించి వివరించిన ఈ సంపాదకీయలను అంగీకరించాలని విశ్లేషకులు అంటున్నారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటన) చట్టం, 1954 ప్రకారం.. ఆ చట్టంలో పేర్కొన్న షరతులకు చికిత్స చేయడానికి ఉద్దేశించిన డ్రగ్స్ కోసం తప్పుదోవ పట్టించే ప్రకటనలను ప్రచురించటానికి పతంజలి మాత్రమే కాదు.. ప్రెస్ కూడా బాధ్యత వహిస్తుంది. కాబట్టి, ప్రకటనలను ప్రచురించిన, ప్రసారం చేసిన అన్ని వార్తాపత్రికలు, మీడియా సంస్థలు చట్టాన్ని ఉల్లంఘించినందుకు పతంజలి వలె బాధ్యత వహిస్తాయని విశ్లేషకులు అంటున్నారు.పతంజలి "డ్రగ్స్" తయారీకి లైసెన్స్‌ని జారీ చేసిన ఉత్తరాఖండ్ డ్రగ్ కంట్రోలర్ పాత్రనూ నిపుణులు, విశ్లేషకులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. పతంజలి చాలా ప్రకటనలు బీజేపీ పాలిత పలు రాష్ట్రాల్లోని అనేక ఇతర వార్తాపత్రికలలో ప్రచురించబడ్డాయి. వీటిని ప్రచురించినప్పుడు




డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటన) చట్టం కింద చర్యలు తీసుకునే అధికార పరిధి ఈ రాష్ట్రాల్లోని డ్రగ్ కంట్రోలర్‌లకు ఉంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోని విషయాన్ని విశ్లేషకులు, నిపుణులు గుర్తు చేస్తున్నారు.పతంజలి పాపంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖలకు చెందిన బ్యూరోక్రసీ ఉన్నదని ఆరోపిస్తున్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖను ప్రత్యేకంగా మోడీ ప్రభుత్వం తన మొదటి టర్మ్‌లో సృష్టించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇతర ఔషధాల వంటి కఠినమైన డబుల్ బ్లైండ్ క్లినికల్ ట్రయల్స్ తర్వాత భద్రత, సమర్థతపై డేటాను రూపొందించటానికి ఆయుష్ పరిశ్రమకు అవసరమయ్యే రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించటంలో ఈ రెండు శాఖలకు చెందిన బ్యూరోక్రసీ విఫలమైందని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.2010లో, ప్రభుత్వం ఆయుష్ పరిశ్రమపై విధించిన రూల్ 158బీని ప్రవేశపెట్టింది. ఈ రూల్ ప్రకారం.. ఆయుష్ విభాగం వారు ప్రవేశపెడుతున్న కొత్త ఔషధాల భద్రత, ప్రభావానికి సంబంధించిన రుజువులను ప్రదర్శించాల్సిన అవసరం ఉంటుంది. అయితే అటువంటి ఆధారాలను రూపొందించే విధానంపై స్పష్టత రాకపోవటం గమనార్హం. కాగా, ప్రభుత్వం 2018లో ఆయుష్ మంత్రిత్వ శాఖ రూల్ 158బీ ప్రకారం పరిశ్రమ ఎలాంటి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీనికి బదులుగా.. ఆయుష్ పరిశ్రమ పైలట్ అధ్యయనాలు నిర్వహిస్తే సరిపోతుందని సంబంధిత మంత్రిత్వ శాఖ నిర్ధారించింది. అయితే, ఈ రోజు వరకు కూడా పైలట్ అధ్యయనాలు అంటే మంత్రిత్వ శాఖ నుంచి సమాచారం లేదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటివి పతంజలి వంటి సంస్థలకు బలాన్ని అందించాయని చెప్తున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మీడియా, బ్యూరోక్రసీ నుంచి ఆశించిన స్పందన లేకపోవటం, విఫలమైన వ్యవస్థల పూర్తి వైఫల్యం కారణంగానే పతంజలి ఈ రోజు వరకు అభివృద్ధి చెందిందని విశ్లేషకులు, మేధావులు అంటున్నారు. పతంజలి ద్వారా స్పాన్సర్ చేయబడిన ప్రకటనలు ఆయుష్ పరిశ్రమ ద్వారా కూడా ప్రచురించబడతాయనీ, 2022లో ప్రచురితమైన ప్రకటనలు ఇంగ్లీషు భాషా వార్తాపత్రికలలో

# అమరావతి నమూనా గ్యాలరీ ధ్వంసం...

అమరావతి, రాజధాని అమరావతి నమూనా గ్యాలరీని దుండగులు ధ్వంసం చేశారు. గతంలో ఉద్ధండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రదేశంలో నమూనా గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఇది ధ్వంసమైనట్లు స్థానిక రైతులు గుర్తించారు. అమరావతి ముఖచిత్రం, చారిత్రక ఘట్టాలు, మ్యాప్‌లు, కట్టడాలకు సంబంధించిన నమూనాలు, విశేషాలను తెలిపే బోర్డులను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రదేశానికి సరైన రక్షణ ఏర్పాటు చేయలేదు. ఆ ప్రాంగణానికి ఉన్న గేట్లనూ అక్రమార్కులు తొలగించి పక్కన పడేశారు. ప్రస్తుతం అక్కడ సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. రాజధాని ప్రాంతంలో ఇప్పటి వరకు రోడ్లను ధ్వంసం చేసి ఇసుక, కంకర, మట్టి, ఇనుము చోరీ చేసిన దుండగులు.. ఇప్పుడు శంకుస్థాపన ప్రాంతాన్నీ ధ్వంసం చేయడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com